క్లుప్తంగా

వీవీప్యాట్లు, కంట్రోల్ యూనిట్లలో అభ్యర్థుల వివరాల నమోదు



ఈవీఎంల కమిషనింగ్ ప్రక్రియను వివరిస్తున్న రిటర్నింగ్ అధికారి భార్గవ్‌తేజ

కర్నూలు (టౌన్): కర్నూలు నియోజకవర్గ ఈవీఎంల కమిషనింగ్ ప్రక్రియలో భాగంగా వీవీప్యాట్లు, కంట్రోల్ యూనిట్లలో అభ్యర్థుల వివరాలు నమోదు చేస్తున్నట్లు రిటర్నింగ్ అధికారి భార్గవ్‌తేజ స్పష్టం చేశారు. గురువారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో ఈవీఎంల కమిషనింగ్ ప్రక్రియలో శిక్షణ పొందిన 50 మంది అధికారుల బృందాలు పాల్గొని అభ్యర్థుల పేర్లు, వివరాలు నమోదు చేశారు. ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారి మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ ప్రారంభం అవుతున్నందున ఎన్నికల సిబ్బంది ప్రతి అంశంపై అవగాహన పెంచుకోవాలన్నారు. అభ్యర్థుల పేర్లను భారత ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్‌కు చెందిన ఇంజినీర్లు కంట్రోల్ యూనిట్లలో అప్ లోడ్ చేస్తారన్నారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణి, నగర పాలక అదనపు కమిషనర్ రామలింగేశ్వర్ పాల్గొన్నారు.

5న నవ్వు ఉపయోగాలపై సదస్సు

కర్నూలు(హాస్పిటల్): నవ్వడం వల్ల ఉపయోగాల గురించి ఈ నెల 5వ తేదీన ఆరోగ్య అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు కర్నూలు హార్ట్ ఫౌండేషన్ కార్యదర్శి డాక్టర్ పి.చంద్రశేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రపంచ నవ్వుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం సాయంత్రం 6 గంటలకు స్థానిక ఎ.క్యాంపులోని కర్నూలు హెల్త్ క్లబ్‌లో ఈ సదస్సు ప్రారంభమవుతుందన్నారు. లాఫ్ థెరపిస్టు, హ్యాపీ లైఫ్ కోచ్ సి. సలీమ్‌బాషా నవ్వులవల్ల ఉపయోగాలను వివరిస్తారని తెలిపారు

మోదీకి ఆదరణ తగ్గిపోతోంది

కర్నూలు(సెంట్రల్): ఎన్నికలకు సమయం దగ్గరపడుతున్న కొలది మోదీకి ఆదరణ తగ్గుతోందని డీసీసీ అధ్యక్షుడు కె.బాబురావు అన్నారు. గురువారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పలువురు పార్టీలో చేరారు. వారికి ఆయన కండువాలు కప్పి ఆహ్వానించి మాట్లాడారు. కార్యక్రమంలో కర్నూలు కాంగ్రెస్ అభ్యర్థి జిలానీ బాషా, డీసీసీ ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ గుప్తా పాల్గొన్నారు.

సీపీఎం అభ్యర్థి ప్రచారం

కర్నూలు(సెంట్రల్): పాణ్యం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న సీపీఎం అభ్యర్థి డి.గౌస్‌దేశాయ్ ఇంటింటి ప్రచారం ముమ్మరం చేశారు. గురువారం ఆయన నగరంలోని విట్టల్ నగర్, తారక రామ్‌నగర్, కృష్ణానగర్లలో తిరిగి ఓట్లు అభ్యర్థించారు.కార్యక్రమంలో నాయకులు పీఎస్ రాధాకృష్ణ, జి.రామన్న, ఎండీ ఆనంద్‌బాబు, వై.నగేష్, ప్రసాదు శర్మ,సాయిబాబా, వెంకట్, యేసు, రాఘవేంద్ర, అబ్దుల్లా పాల్గొన్నారు.

ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించండి

కర్నూలు(సెంట్రల్): కర్నూలు, పాణ్యం నియోజకవర్గాల్లో ఇండియా కూటమి తరుపున పోటీ చేస్తున్న జిలానీబాషా, డి.గౌస్‌దేశాయ్‌లను గెలిపించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు, రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథం కోరారు.గురువారం సీపీఐ కార్యాలయంలో కర్నూలు కాంగ్రెస్‌అభ్యర్థి జిలానీ బాషాతో కలసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

నేడు 'ఎన్నికల భారతం' పుస్తకావిష్కరణ

కర్నూలు కల్చరల్: అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు స్థానిక సలాం ఖాన్ భవన్‌లో 'ఎన్నికల భారతం' కవితా సంకలనం పుస్తకావిష్కరణ చేస్తున్నట్లు అరసం అధ్యక్షుడు కె.ప్రహ్లాద్ తెలిపారు. ప్రముఖ కథా రచయిత డాక్టర్ ఎం.హరికిషన్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తారని, రచయిత్రి రాణి లీలావతి పుస్తక సమీక్ష చేస్తారని పేర్కొన్నారు. సాహితీ ప్రియులందరూ పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

పేదలకు అండగా వైఎస్సార్‌సీపీ



41వ వార్డులో ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ శ్వేతారెడ్డి

కల్లూరు: పేదలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అండగా ఉంటుందని కల్లూరు అర్బన్ 41వ వార్డు కార్పొరేటర్ గాజుల శ్వేతారెడ్డి అన్నారు. గురువారం వీకర్‌సెక్షన్ కాలనీలో ఇంటింటికి తిరుగుతూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ ఐదేళ్లలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చేసిన మంచిని వివరించారు. మరోసారి ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డిని గెలిపించుకుంటే వార్డు మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు గంగులు, ప్రతాప్‌రెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఇంటి వద్ద సేవలకే ఓటేద్దాం

- ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఇంతియాజ్
- మాజీ ఎమ్మెల్యే ఎస్వీతో కలిసి 23 వ వార్డులో ప్రచారం



వైఎస్సార్‌సీపీలో చేరిన 51 వ వార్డు ప్రజలతో కర్నూలు అసెంబ్లీ అభ్యర్థి ఇంతియాజ్



కప్పల్‌నగర్‌లో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి ఇంతియాజ్, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే ఎస్వీ

కర్నూలు (టౌన్): గతంలో ఎన్నడూ లేని విధంగా వలంటీర్ వ్యవస్థ, సచివాలయాల వ్యవస్థలను ఏర్పాటు చేసి ఇంటి వద్దకే సేవలు అందిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఓటేసి గెలిపించుకుందామని వైఎస్సార్‌సీపీ కర్నూలు అసెంబ్లీ అభ్యర్థి ఇంతియాజ్ ఓటర్లకు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక 23 వ వార్డు శ్రీరామనగర్‌లో మాజీ ఎమ్మెల్యే, కర్నూలు పార్లమెంట్ డిప్యూటీ రీజినల్ కో- ఆర్డినేటర్ ఎస్వీమోహన్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్ కటారి పల్లవితో కలిసి ఇంటింటికీ ఇంతియాజ్ కార్యక్రమం నిర్వహించారు. ఓటర్లను కలిసి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. అనంతరం ఇంతియాజ్ మాట్లాడుతూ 58 నెలలు మంచి పాలన అందించిన జగనన్న వస్తేనే ప్రజలకు మరింత మేలు జరుగుతుందన్నారు. మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మాట్లాడుతూ చెప్పినవి చెప్పినట్లు ఐదేళ్ల పాటు పేద వర్గాలకు సంక్షేమ ఫలాలు అందించిన వైఎస్సార్‌సీపీకి ఎన్నికల్లో పట్టం కట్టాలన్నారు. తెలుగుదేశం పార్టీ మేనిఫెస్టోలో ప్రకటించిన మోసపూరిత హామీలను నమ్మితే ఇబ్బందులు పడతామన్నారు. ఆ పార్టీ అధికారంలోకి వచ్చేది లేదన్నారు. అందుకే బాబు ఆచరణ సాధ్యం కాని హామీలు ఇచ్చారన్నారు.

ఇంతియాజ్‌కు అవకాశం ఇవ్వండి

'కర్నూలు అసెంబ్లీ అభ్యర్థిగా రాష్ట్ర స్థాయిలో పనిచేసిన ఐఏఎస్ అధికారి ఇంతియాజ్‌ను ప్రకటించారు. ఆయనకు ఒక అవకాశం ఇచ్చి గెలిపించుకుంటే ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుంద'ని మాజీ ఎమ్మెల్యే, కర్నూలు పార్లమెంట్ డిప్యూటీ రీజినల్ కోఆర్డినేటర్ ఎస్వీ మోహన్ రెడ్డి స్పష్టం చేశారు. గురువారం రాత్రి ఇంటింటికీ ఇంతియాజ్ కార్యక్రమంలో భాగంగా స్థానిక అశోక్‌నగర్, శ్రీనగర్ కాలనీల్లో ముమ్మరంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానికుల నుంచి మంచి స్పందన వచ్చింది. ఎస్వీ మాట్లాడుతూ ఏ సమస్య వచ్చినా ఇంతియాజ్ ప్రజలకు అందుబాటులో ఉంటారని చెప్పారు. తనకు ఒక అవకాశం ఇస్తే కర్నూలు నగరాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే అభ్యర్థి ఇంతియాజ్ ఈ సందర్భంగా ఓటర్లను అభ్యర్థించారు.

వైఎస్సార్‌సీపీలో చేరికలు

- నగరంలోని 51 వ వార్డు కొత్తపేట, గొళిగేరికి చెందిన 200 మంది వైఎస్సార్‌సీపీలో చేరారు. గురువారం స్థానిక నరసింగరావు పేటలోని పార్టీ నగర కార్యాలయంలో వార్డు ఇన్‌చార్జ్ క్రిష్ణకాంత్ శర్మ ఆధ్వర్యంలో కృపాదానం, ఫరూక్, సలీం, శేఖర్, చంద్ర, ఏజాస్, షేక్షా, ఫిరోజ్, ఖాదర్‌తో కలిసి వారి కుటుంబ సభ్యులు, మిత్రులు పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారిని కర్నూలు అసెంబ్లీ అభ్యర్థి ఇంతియాజ్ ప్రత్యేకంగా అభినందించారు. జగనన్న చేసిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లి వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలన్నారు.
- మార్కెట్ యార్డు రిక్షా యూనియన్, కల్యాణ్ ఆటో యూనియన్ నాయకుల ఆధ్వర్యంలో పలువురు కర్నూలు అసెంబ్లీ అభ్యర్థి ఇంతియాజ్‌ను కలిసి వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో శేఖర్, దావీదు, నాగేశ్వరుడు, సత్యనారాయణ శెట్టి, మల్లిఖార్జున, ప్రసాద్, వేణు ఉన్నారు. వీరికి ఇంతియాజ్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

22వ వార్డులో పార్టీ కార్యాలయం ప్రారంభం

నగరంలోని 22 వ వార్డు బీక్యాంపులో వైఎస్సార్ సీపీ కార్యాలయాన్ని ప్రారంభించారు. పార్టీ నేత బాలు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అభ్యర్థి ఇంతియాజ్, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ పాల్గొని మాట్లాడారు. జగనన్నను రెండో సారి గెలిపించుకోవడంలో యువకులు ప్రధాన పాత్ర వహించాలన్నారు. మేనిఫెస్టోను ప్రతి ఇంటికి ఇచ్చి ఫ్యాను గుర్తుకు ఓటు వేసే విధంగా ప్రచారం నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు భారతి, శ్రావణ్, బబ్లూ, సర్వేశ్వరరెడ్డి, టీవీ రమణ, శంకర్ క్రిష్ణమోహన్ పాల్గొన్నారు.

సంక్షేమం కావాలంటే జగనన్న రావాలి



ఠాకూర్‌నగర్‌లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న సిట్రా సత్యనారాయణమ్మ

కర్నూలు (టౌన్) : రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం కావాలంటే రాష్ట్రానికి మరోసారి జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు సిట్రా సత్యనారాయణమ్మ అన్నారు. గురువారం సాయంత్రం 25వ వార్డు పరిధిలోని ఠాగూరు నగర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జగనన్న మేనిఫెస్టో ప్రతులను ఓటర్లకు ఇచ్చి ఓటు అభ్యర్థించారు. కర్నూలు అసెంబ్లీ అభ్యర్థి ఇంతియాజ్, కర్నూలు పార్లమెంట్ అభ్యర్థి బీవై రామయ్యను గెలిపించాలని విన్నవించారు. చేసిందే.. చెప్తాం ..చెప్పిందే.. చేస్తాం అనే నినాదం జగనన్నది అన్నారు. ఐదేళ్ల పాటు జగనన్న అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేశారన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు గడ్డం రామక్రిష్ణ, రంగరాజు, సచివాలయాల కన్వీనర్లు సుధారాణి, ఇబ్రహీం, మురళీ, సురేష్, సునీల్, హనీఫ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఎంపీ అభ్యర్థులను గెలిపించండి



నాగుల కట్ట వీధిలో ఎన్నికల ప్రచారం చేస్తున్న సమీనా ఇంతియాజ్, విజయమనోహరి

కర్నూలు (టౌన్) : వైఎస్సాఆర్‌సీపీ కర్నూలు ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు బీవై.రామయ్య, ఇంతియాజ్‌ను గెలిపించాలని కర్నూలు అసెంబ్లీ అభ్యర్థి ఇంతియాజ్ సతీమణి సమీనా ఇంతియాజ్ స్పష్టం చేశారు. గురువారం రాత్రి స్థానిక 23 వ వార్డు పరిధిలోని నాగుల కట్ట వీధిలో జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్‌పర్సన్ విజయమనోహరితో కలిసి ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. పరిపాలన అనుభవం ఉన్న ఇంతియాజ్‌ను గెలిపించుకుంటే నగరం మరింత అభివృద్ధి సాధిస్తుందన్నారు. కేడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ మాట్లాడుతూ చంద్రబాబు మేనిఫెస్టో అబద్ధాల పుట్ట అన్నారు. 2014 సంవత్సరంలో కూడా 600 హామీలు ఇచ్చి మోసం చేశారన్నారు. జనరంజక పాలన అందిస్తున్న జనన్ననే మరోసారి గెలపించుకుందామన్నారు.

4న కూచిపూడి నవ వసంతం

కర్నూలు కల్చరల్: భరత కళా గ్రామ, నాట్య వేద కూచిపూడి కళా నిలయం, టీజీవీ కళాక్షేత్రం సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 4వ తేదీ సాయంత్రం 6.30 గంటలకు సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో కూచి పూడి నవ వసంతం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు నాట్యాచార్యులు కె.తేజేశ్వర్, పి. రోహిత్ కుమార్ తెలిపారు. కార్యక్రమానికి కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత, కూచిపూడి సిద్ధేంద్ర యోగి కళా పీఠం ప్రిన్సిపాల్ డాక్టర్ వేదాంతం రామలింగ శాస్త్రి, కేంద్ర సంగీత నాటక అకాడమీ బిస్మిల్లాఖాన్ యువ పురస్కార్ అవార్డు గ్రహీత బెంగళూరు భరత కళా గ్రామ అధ్యక్షులు డాక్టర్ ఆర్. వసంత్ కిరణ్ అతిథులుగా హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. కళాకారులతో కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక



పార్టీలో చేరిన వారితో యువనేత కాటసాని శివనరసింహారెడ్డి

కల్లూరు: ఓర్వకల్లు మండలం కాల్వ గ్రామం జంగాలపేటకు చెందిన 40 టీడీపీ కుటుంబాలు గురువారం ఎర్రద్దుల సుల్తాన్ ఆధ్వర్యంలో యువనేత కాటసాని శివనరసింహారెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈశ్వరయ్య, ఎల్లప్ప, ఎల్ల సుబ్బుడు, చంద్ర, సుబ్బరాయుడు, హరి, శాలన్న, వంశీ, బాబు తదితరులు చేరిన వారిలో ఉన్నారు. అనంతరం కాటసాని శివనరసింహారెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగనన్న అందిస్తున్న పథకాలు కొనసాగాలంటే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రావాలన్నారు. నవరత్నాల పథకాల వల్ల రాష్ట్రంలో ప్రతి గడపకు లబ్ధి చేకూరిందన్నారు. వైఎస్ జగనన్నలా గతంలో ఏ ముఖ్యమంత్రి పాలన అందించలేదన్నారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా ఆయన పాలన సాగిస్తున్నారని చెప్పారు. ఈ నేపథ్యంలో 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా పని చేయాలని పిలుపునిచ్చారు.

జగన్‌తోనే జనరంజక పాలన

- ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో గ్రామాల అభివృద్ధి
- రైతులకు రెండు పంటలకు నీరందించి అండగా నిలబడ్డాం
- టీడీపీ హయాంలో ఏం అభివృద్ధి చేశారో చెప్పాలి
- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి
- పాణ్యం మండలంలో విస్తృత ప్రచారం



పాణ్యం మండలంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

పాణ్యం: ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జనరంజక పాలన చేశారని.. గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దారని.. కరోనాతో ఆర్థిక ఇబ్బందులు తలెత్తినా సంక్షేమం, అభివృద్ధి ఆగలేదని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం మండలంలోని గగ్గటూరు, కొత్తూరు, అనుపూరు, అహల్యాపురం, భూపనపాడు, మద్దూరు గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ఐదేళ్లలో ప్రతి గ్రామంలో సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ ఏర్పాటు చేశామన్నారు. నాడు-నేడుతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను మార్చివేశారని తెలిపారు. సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, కాలువలు నిర్మించామన్నారు. గతంలో గ్రామాలు ఎలా ఉండేవి.. ఇప్పుడు ఎలా ఉన్నాయో ప్రజలే గమనించాలన్నారు. టీడీపీ నాయకులు తమ హయాంలో ఏం అభివృద్ధి చేశారో చెప్పాలని ప్రశ్నించారు. అభివృద్ధి చేయకపోగా మంచి చేసిన ప్రభుత్వంపై విమర్శలు చేయడమే పనిగా పెట్టుకున్నారని మండిపడ్డారు. అధికారంలో ఉన్నప్పుడు ఏం చేయలేని వారు ఇప్పుడు తనపై విమర్శలు చేస్తే సహించేది లేదన్నారు. చేసిన మంచి పనులను చెప్పుకోవాలే గాని బురద జల్లడం సరికాదన్నారు. వారి హయాంలో ఏ ఒక్కరూ సంతోషంగా లేరన్నారు. నీటి కోసం రైతులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. కరెంటు ఎప్పుడు వస్తుందో తెలియక రాత్రి పూట పొలాల్లోనే నిద్రమానుకుని గడిపారని గుర్తు చేశారు.

టీడీపీ నేతలు రైతుల కడుపు కొట్టారు

గత ప్రభుత్వ హయాంలో గోరుకల్లు ఆయకట్టు నుంచి బనగానపల్లెకు జలహారతి కోసం నీటిని తరలించారని ఎమ్మెల్యే మండిపడ్డారు. ఆయకట్టు నీటి హక్కులను కాలరాసి మండల రైతులను కడుపుకొట్టి బీసీ జనార్దన్ రెడ్డి నీటిని తరలిస్తుంటే ఆ నాడు అధికారంలో ఉన్న వారు ఒక్క మాట కూడా మాట్లాడలేదని విమర్శించారు. పోలీసులను పెట్టి నీటిని తరలిస్తున్న క్రమంలో రైతులు హైవేపై ధర్నా చేసినా పట్టించుకోలేదని తెలిపారు. వారి హయాంలో ఒక పంటకు నీరందించడమే గగనంగా ఉండేదన్నారు. తమ ప్రభుత్వంలో రెండు పంటలకు నీరందించి రైతులను ఆదుకున్నామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు సద్దల సరళమ్మ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సద్దల సూర్యనారాయణ రెడ్డి, ఎంపీపీ ఉసేన్‌బీ, వైస్ ఎంపీపీలు వెంకటేశ్వర్లు, పార్వతమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు లక్ష్మీదేవి, సంధ్యారాణి, సర్పంచ్‌లు సద్దల పద్మావతి, బీరం రాజేశ్వరి, కంపమళ్ల నాగలక్ష్మమ్మ, ప్రదీప్‌రెడ్డి, జనార్దన్, నాయకులు సద్దల శ్రీనివాసరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, ఖాదర్, కృష్ణారెడ్డి, సుధాకర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, శివరామిరెడ్డి, నారాయణస్వామి, వీరయ్య, శ్రీనివాసులు, సుమంత్‌రెడ్డి శ్రీనాథ్‌రెడ్డి, రామలక్ష్మయ్య, మహేంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరు సచివాలయం పరిధిలో రూ.2 కోట్ల అభివృద్ధి పనులు

కొత్తూరు గ్రామ సచివాలయ పరిధిలో రూ.2 కోట్లతో అభివృద్ధి పనులు చేసినట్లు కాటసాని తెలిపారు. అలాగే మొదటిసారిగా కొత్తూరు గ్రామ సచివాలయంలో భూముల రిజిస్ట్రేషన్‌ను ప్రారంభించామన్నారు. గగ్గటూరు గ్రామానికి ఊరుమందు వాగుపై రూ. 2 కోట్లతో బ్రిడ్జి నిర్మించేందుకు అనుమతులు వచ్చాయన్నారు. అయితే కోడ్ కారణంగా ప్రక్రియ ఆగినట్లు తెలిపారు. అలాగే కొత్తూరు గ్రామంలో రూ.2.5 కోట్లతో ఆలయాన్ని అభివృద్ధి చేశామన్నారు.

టీడీపీకి ఓటేస్తే ముస్లిం రిజర్వేషన్లు రద్దు

- ఎన్నికల ప్రచారంలో కోడుమూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి సతీష్
- టీడీపీ ఎంపీ అభ్యర్థి గ్రామంలో ప్రచారానికి అనూహ్య స్పందన



ముస్లింలకు ఓటు అభ్యర్థిస్తున్న సతీష్

కర్నూలు (సిటీ): అధికారం కోసం బీజేపీతో జతకట్టిన టీడీపీకి ఓటేస్తే ముస్లిం మైనార్టీల రిజర్వేషన్లు రద్దు అవుతాయని కోడుమూరు ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలపు సతీష్ అన్నారు. కర్నూలు మండలం పంచలింగాల గ్రామంలో కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కొత్తకోట ప్రకాష్‌రెడ్డి, ఎం.మణిగాంధీతో కలిసి సతీష్ నిర్వహించిన ఎన్నికల ప్రచారానికి ప్రజల నుంచి భారీ స్పందన లభించింది. టీడీపీ ఎంపీ అభ్యర్థి గ్రామమైనా వైఎస్సార్‌సీపీకి మద్దతుగా భారీ సంఖ్యలో జనం తరలివచ్చారు. బహిరంగ సభలో నాయకులు మాట్లాడుతూ.. చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేసిన దాఖలాలు లేవన్నారు. కేవలం ఎన్నికల సమయంలో రంగురంగుల మేనిఫెస్టోతో ప్రజల ముందుకు వస్తుంటారన్నారు. అధికారం కోసం రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు, రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో పెట్టుకోకుండా కల్లబొల్లి మాటలతో ప్రజలను మోసం చేయాలని చూస్తున్నారని విమర్శించారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేసే ఓట్లు అడుతున్నారని చెప్పారు.

ఒంటరిగా ఎదుర్కోలేక..

జగన్‌మోహన్‌రెడ్డిని ఒంటరిగా ఎదుర్కోలేక టీడీపీ, జనసేన, బీజేపీ చేతులు కలిపాయన్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్ అమలు చేశారని.. ఎన్డీఏ కూటమి అధికారంలోకి వస్తే 4 శాతం రిజర్వేషన్లను రద్దు చేస్తామని బీజేపీ పెద్దలు చెబుతున్నారన్నారు. ప్రతి ఒక్కరూ ఓటు వేసే ముందు ఆలోచించి మంచి చేసిన ప్రభుత్వానికి ఓటు వేయాలని కోరారు. జెడ్పీటీసీ సభ్యుడు ప్రసన్నకుమార్, పార్టీ మండల కన్వీనర్ మహబూబ్ బాషా, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు డి.వాసు, వైస్ ఎంపీపీ నెహిమియా, ఎంపీటీసీలు రామ్‌నాథ్‌రెడ్డి, హనుమంతు, రేమట సంపత్‌కుమార్, ఉల్చాల సర్పంచ్ విద్యాసాగర్, సింగిల్ విండో చైర్మన్ వినయ్‌కుమార్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్ రెడ్డి, ప్రసాద్, పంచలింగాల వెంకటేశ్వరరెడ్డి, గచ్చెంటి శేఖర్, నారాయణరెడ్డి, ఉప్పల నవీన్‌రెడ్డి, బోయ సాయన్న, చింతమాగుల వెంకటేశ్వర్లు, చిన్నలక్ష్మన్న, అజీజ్, జి.శింగవరం వెంకటేశ్వరరెడ్డి, రవిరెడ్డి, భాస్కర్, ఫిరోజ్‌ఖాన్, సంపత్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే సంక్షేమ పాలన

గూడూరు: వైఎస్సార్‌సీపీతోనే సంక్షేమ పాలన సాధ్యమని మున్సిపల్ చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ పీఎస్ అస్లామ్ అన్నారు. పట్టణంలోని దళితవాడల్లో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఐదేళ్లలో చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకుంటే రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. అమ్మఒడి, వైఎస్సార్ ఆసరా, చేయూత, తదితర పథకాలు కొనసాగాలంటే ఫ్యాను గుర్తుకు ఓటు వేయాలని కోరారు.

రెండో నెల..అవే కష్టాలు

- మండుటెండల్లో పింఛన్లకోసం పండుటాకుల పాట్లు
- బ్యాంకుల వద్ద గంటల తరబడి నిరీక్షణ
- చంద్రబాబు వల్లే ఈ కష్టాలని ఆగ్రహం





పింఛన్ డబ్బు కోసం బ్యాంకుకు వచ్చి నిరీక్షిస్తున్న వృద్ధురాలు, కృష్ణానగర్ కేడీసీసీ బ్యాంకులో పింఛన్ల కోసం అవస్థలు పడుతున్న లబ్ధిదారులు

కర్నూలు (టౌన్): ప్రతి నెల 1వ తేదీ ఉదయాన్నే ఇంటి వద్ద పింఛన్లు పొందిన అవ్వా, తాతలు, దివ్యాంగులు, వితంతువులు టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు నిర్వాకంతో గత రెండునెలలుగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సకాలంలో పింఛన్లు అందుకోలేకపోతున్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వలంటీర్ల ద్వారా ఏప్రిల్ నెల నుంచి పింఛన్ల పంపిణీని అడ్డుకున్న చంద్రబాబు అక్కసు అంతటితో ఆగలేదు. మే నెల పింఛన్లు గ్రామ సచివాలయాల్లో ఇవ్వకుండా నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశాడు. దీంతో ఈ నెల పింఛన్ల మొత్తాన్ని అధికారులు బ్యాంకు ఖాతాల్లో వేశారు. నగరంలోని 34,232 మంది పెన్షన్ దారులు ఉన్నారు. ప్రభుత్వం ప్రతి నెలా వారి ఇంటి వద్దకు వెళ్లి రూ.10. 37 కోట్లు చెల్లిస్తుంది. ఎన్నికల కమిషన్ ఆదేశాలతో ఈనెల బ్యాంక్ ఖాతాల్లో వేయాల్సి వచ్చింది. అయితే, బ్యాంకు అకౌంట్లు ఉన్న లబ్ధిదారులు 19 వేల వరకు ఉన్నారు. వీరిలో చాలా మంది అకౌంట్లకు ఆధార్ కార్డు లింకు లేకపోవడం..సక్రమంగా ఖాతా నిర్వహణ చేయలేకపోవడం, బ్యాలెన్స్ లేకపోవడం తదితర కారణాలతో బ్యాంకులకెళ్లి పింఛన్ సొమ్ము పొందలేని పరిస్థితి.

మండుటెండల్లో అవస్థలు

పింఛన్ సొమ్ము బ్యాంకు ఖాతాల్లో జమ కావడంతో పండుటాకులు డబ్బులు తీసుకునేందుకు మండుటెండల్లో పడరాని పాట్లు పడ్డారు. గురువారం నగరంలోని స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా, ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు, కేడీసీసీ బ్యాంకులకు వృద్ధులు, వితంతువులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి క్యూలో నిల్చున్నారు. చివరకు బ్యాంకు ఖాతాకు ఆధార్ లింకు కాలేదని, ఖాతా యాక్టివ్‌లో లేదని బ్యాంకు సిబ్బంది వెనక్కు పంపడంతో వారు నిరాశ చెందారు. చంద్రబాబు నిర్వాకం వల్లే తమకు ఇబ్బందులు వచ్చాయని కొందరు ఆగ్రహం వ్యక్తం చేయగా.. తమ ప్రాణాలతో బాబు చెలగాటమాడుతున్నాడని అవ్వాతాతలు శాపనార్థాలు పెట్టారు.

బాబుకు మా ఉసురు తగులుతుంది



నరకం అనుభవిస్తున్నాం. 58 నెలల పాటు ఇంటి వద్దకే వలంటీర్లు వచ్చి పెన్షన్ చేతి లో పెట్టారు. ఇప్పుడు తెలు గుదేశం వాళ్లు కేసులు వేసి వలంటీర్లను తొలగించారని చెబుతున్నారు. ఫోన్లు చేసినా వారు రావడం లేదు. దీంతో మేము తీవ్రఇబ్బందులు పడుతున్నాం.ఎన్టీఆర్ బిల్డింగ్ నుంచి క్రిష్ణనగర్‌కు రూ.70 ఇచ్చి ఆటోలో వచ్చాం. ఉదయం నుంచి ఇక్కడే పడిగాపులు కాస్తున్నాం. మా ఉసురు బాబుకు తప్పదు.

– పెద్ద లక్ష్మమ్మ, వితంతువు, ఎన్టీఆర్ నగర్

రెండు నెలల నుంచి కష్టాలు



మేము నిరుపేదలం. నాకు వృద్ధాప్య పెన్షన్ వస్తుంది. తెలుగుదేశం ప్రభుత్వంలో పెన్ష న్ కోసం గంటల తరబడి ఎదు రు చూడాల్సిన పరిస్థితి ఉండేది. జగన్ వచ్చిన తరువాత ప్రతి నెల ఇంటికి వచ్చి వలంటీర్ ఇచ్చేవారు.దీంతో మాకు ఎలాంటి ఇబ్బంది ఉండేది కాదు.ఎన్నికల సమయంలో బాబు కేసు వేసి వలంటీర్లను తొలగించారని చెబుతున్నారు. దీంతో రెండునెలలుగా పింఛన్ పొందేందుకు ఇబ్బంది లు పడుతున్నాం.

–రామక్క,వృద్ధురాలు, శరీన్ నగర్

ఆధార్‌కార్డు లింకు లేదంటున్నారు



నాకు 70 ఏళ్లు దాటాయి. అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్నా. రెండు నెలలుగా పెన్షన్ సక్రమంగా రావడం లే దు.ఎందుకు వలంటీర్లను తీసేసినారో తెలియదు.వారు ఉంటే మాకు ఇంటికి వచ్చి పింఛన్ ఇచ్చేవారు. ఇప్పుడు బ్యాంకుకు వస్తే ఆధార్‌కార్డు లింకు లేదంటున్నారు. ఖాతా సక్రమంగా నిర్వహించడం లేదని చెబుతున్నారు. వలంటీర్లను తొలగించి మమ్మల్ని ఇలా ఇబ్బంది పెడితే వారికి ఏం వస్తుందో అర్థం కావడం లేదు.

–హమత్ బీ,వృద్ధురాలు, న్యూకృష్ణా నగర్